చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

లింగాల : ఇప్పట్ల గురుకుల పాఠశాలలో చట్టాలపై విద్యార్థినులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మహిళా పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులకు ఏదైనా సమస్య వచ్చిన వెంటనే హెల్ప్ లైన్ నెంబరు 1098కు ఫోన్ చేయాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి సైబర్ క్రైం గురించి, చైల్డ్ లైన్ మ్యారేజ్, పర్సనల్ సేఫ్టీ, సెక్యూరిటీ గురించి వివరించారు. సమాజంలో ఆడపిల్లల మీద జరుగుతున్న అరాచకాల గురించి వివరించి ఆడపిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పరామర్శ

వల్లూరు (చెన్నూరు) : స్థానిక నేత చిలేకాంపల్లి ద్వారకనాథరెడ్డి అనారోగ్య విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జీఎం భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ సురేష్‌యాదవ్, ఉప్పరపల్లి ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచండి

పులివెందుల టౌన్ : మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థి ప్రేరణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చేత మొక్కలు నాటించే కార్యక్రమం నిర్వహించారు. చెట్లు ప్రకృతిలోనున్న వాతావరణ కాలుష్యాన్ని తగ్గిస్తాయని, వర్షాలు కురవడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు.

• కుందూకు పోటెత్తిన వరద నీరు



కొద్ది రోజులుగా కర్నూలు జిల్లాలో వర్షాలు కురవడం, శ్రీశైలం జలాశయానికి భారీగ వరద నీరు రావడంతో పోతిరెడ్డి పాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా కుందూ నదికి అధికారులు 30 వేల క్యూసెక్కుల నీరు విడదుల చేయడంతో కూందూ నదికి వరద నీరు పోటెత్తుతోంది. దీంతో కుందూ నది పరిసర గ్రామాల ప్రజలు పంటలు సాగు చేసిన భూములు వరద నీటిలో మునిగిపోయాయి. నెమళ్లదిన్నె గ్రామం వద్ద ఉన్న వంతెనపై మూడు అడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. - పెద్దముడియం

• మలుపు వద్ద కంపచెట్లను తొలగించండి



మండలంలోని బురుజుపల్లె నుంచి ఏటూరు బైపాస్ వరకు పంచాయతీరాజ్ రోడ్డులో కంపచెట్ల పొదలు ఉన్నాయి. ఈ రహదారిలో నిత్యం ద్విచక్ర వాహనదారులు రద్దీగా తిరుగుతున్నారు. రామిరెడిపల్లె సమీపం ఓ మలుపు వద్ద కంపపొదలు ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ఢీ కొనే ప్రమాదం ఉందన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరుగక మునుపే రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాతీరాజ్ ఎఈ శివప్రసాద్‌గౌడ్‌ను వివరణకోరగా పంచాయతీ సెక్రటరీతో మాట్లాడి కంపచెట్లను తొలిగిస్తామన్నారు. - కొండాపురం

బీరు సీసాల లారీ బోల్తా



బోల్తాపడిన బీరు బాటిళ్ల లోడ్‌తో కూడిన లారీ

చింతకొమ్మదిన్నె : కడప-రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వలచెరువు ఘాట్‌లో నాలుగో మలుపు వద్ద బుధవారం బీరు సీసాల లోడ్‌తో వస్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. విషయం తెలుసుకున్న సీకే.దిన్నె పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చేరుకొని లారీ, అందులో మద్యం సీసాలు పరిశీలించారు. సగం బీరు సీసాలను స్థానికులు, ప్రయాణికులు తీసుకొని పరుగుపెట్టారు. సీకే.దిన్నె పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

110 సంచుల రేషన్ బియ్యం పట్టివేత

కమలాపురం: మండలంలోని సంబటూరు రేషన్ దుకాణంలో 110 సంచుల రేషన్ బియ్యం పక్కదారి పట్టినట్లు సర్పంచ్ తనయుడు ఎల్లారెడ్డి బుధవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. విలేకరులతో ఎల్లారెడ్డి మాట్లాడుతూ తమ గ్రామానికి ప్రతి నెలా 180 బస్తాల రేషన్ బియ్యం రావాల్సి ఉండగా, 70 బస్తాలు వస్తున్నాయన్నారు. ఆర్ఐ అర్జున్‌ను ఈ విషయం అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని, దీంతో తహసీల్దారుకు ఫిర్యాదు చేశానన్నారు. గత మూడు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని ఆరోపించారు. తహసీల్దారు శివరామిరెడ్డి వివరణ కోరగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

వేంపల్లె : విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలని ఆర్‌జేడీ, కళాశాల ప్రిన్సిపాల్ రవి, డీవీఈవో వెంకటసుబ్బయ్యలు తెలిపారు. బుధవారం స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రూ.8 కోట్లతో నూతనంగా నిర్మించిన ఉర్దూ కళాశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో పాటు నాణ్యమైన బోధన అందిస్తున్నామన్నారు. కళాశాలలో 9వ తేదీ నుంచి విద్యార్థులకు విద్యా బోధన చేయడం జరుగుతుందన్నారు. అధునాతమైన ల్యాబ్ సౌకర్యం, అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు ఉన్నారన్నారు. విద్యార్థులు సకాలంలో కళాశాలకు రావాలన్నారు. గతంలో లేని విధంగా ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ప్రిన్సిపాల్ హబిబుల్లా, మండల ఖాజీ కరీముల్లా, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేత్రదానాన్ని ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలి



నేత్రదాతల కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ, చైర్మన్

పులివెందుల రూరల్ : నేత్రదానాన్ని ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ సభాభవనంలో 39వ నేత్ర దాన పక్షోత్సవాల సందర్భంగా నేత్ర దాత కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను వారు అందజేసి మాట్లాడారు.

మరో ఇద్దరికి వెలుగు ఇచ్చి మరణం తరువాత కూడా ఈ ప్రపంచాన్ని చూసే బృహత్కార్యాన్ని ప్రతిఒక్కరు ప్రోత్సహించాలన్నా రు. ఇంతవరకూ నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్న దాతలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రామతులశమ్మ నర్సింగ్ హోమ్ డాక్టర్ రవీంద్రారెడ్డి తల్లి రామతులశమ్మ జ్ఞాపకార్థం నేత్ర దాత కుటుంబ సభ్యులకు జ్ఞాపిక లు, ప్రశంసా పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారిణి డాక్టర్ సునీత, నేత్ర సేకరణ కేంద్రం మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్వోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిమోగ్లోబిన్, రక్త వర్గంపై అవగాహన

పులివెందుల టౌన్ : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్-1, 2, ఎంబీఆర్ ట్రస్ట్ డయాగ్నస్టిక్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హిమోగ్లోబిన్, రక్త వర్గము గుర్తింపు పరీక్షలను విద్యార్థినులకు నిర్వహించామని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. బ్లడ్ గ్రూప్ తెలిస్తే రక్త దానం, అవయవదానం చేయవచ్చని, అనారోగ్య సమస్యలను కూడా తెలుసుకోవచ్చన్నారు. హిమోగ్లోబిన్ శాతం తగినంత లేకపోతే రక్తహీనతతో బాధపడుతున్నట్లు అంచనా వేయవచ్చన్నారు. రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుకొనుటకు ఐరన్ శాతం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలైన మాంసము, చేపలు, ఆకుకూరలు, ఎండు ఫలాలు, పండ్లు, కాయకూరలు తగినంత మోతాదులో తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధీర, డయాగ్నస్టిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉలిమెలలో పొలంబడి

పులివెందుల రూరల్ : పొలంబడి కార్యక్రమంలో భాగంగా ఉలిమెల గ్రామ రైతు గోవర్ధన్‌రెడ్డి పొలంలో జీవామృతం తయారీపై రైతులకు బుధవారం మండల వ్యవసాయ అధికారి నాగలక్ష్మి అవగాహన కల్పించారు. 200 లీటర్ల డ్రమ్ములో నీళ్లు తీసుకుని 10 కేజీల ఆవుపేడ, 10 లీటర్లు మూత్రం, రెండు కేజీల నల్ల బెల్లం, రెండు కేజీల పప్పు దినుసుల పిండి, గుప్పెడు పుట్ట మట్టిని డ్రమ్ములో వేయాలన్నారు. మూడు రోజులు ఉదయం, సాయంత్రం ఒక కర్ర సహాయంతో కలియతిప్పగా నాలుగవ రోజు జీవామృతం తయారవుతుందన్నారు. దీనిని డిప్ ద్వారా పంటలకు అందివ్వడం ద్వారా సూక్ష్మ స్థూల పోషకాలు అభివృద్ధి చెంది మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, వీఏఏ, ఐసీఆర్పీఎస్‌లు పాల్గొన్నారు.

ఐరన్ లోపం లేకుండా చూసుకోవాలి

సింహాద్రిపురం : గర్భిణులు, చిన్నపిల్లలు ఐరన్‌లోపం లేకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. పౌష్టికాహారా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గర్భిణులు, చిన్నపిల్లలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతినెల బరువు చూసుకుంటూ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత, సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగు : గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో కూడిన కూరగాయాలు, దినుసులతో మంచి పౌష్టికాహారాన్ని పొందవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. బుధవారం వెంకటేశ్వర కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్ 1లో నిర్వహించిన పౌష్టికాహార దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

వేముల : గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా మహిళలకు సూచించారు. నల్లచెరువుపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో రెండవ రోజు పౌష్టికాహార మాసోత్సవంపై ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. తక్కువ బరువు, ఎత్తు ఉండే పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, కాయగూరలు తప్పనిసరిగా వాడాలని, విటమిన్‌లు ఎక్కువగా ఉండే పౌష్టికాహారాలను తీసుకోవాలన్నారు.

ప్రాజెక్టులకు మరమ్మతులు చేయాలి

జమ్మలమడుగు : జిల్లాలోని ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో అన్నమయ్య ప్రాజెక్టు తెగి భారీగా ప్రాణనష్టం జరిగిందని అలాంటి సంఘటనలు జరగకుండా జిల్లాలోని ప్రాజె క్టులకు ప్రభుత్వం మరమ్మతులు చేయాలన్నారు. ప్రభుత్వాలు విప త్తులు జరుగకముందే ప్రాజెక్టులకు మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యజమానుల పేర్లతో డోర్ నంబర్లు ఇవ్వండి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీలోని 32వ వార్డు బ్రాహ్మణపల్లెలో సుమారు 105 కుటుంబాలకు వారి పేర్లతో డోర్ నెంబర్లు ఇవ్వాలని ఆ వార్డు కౌన్సిలర్ మహేశ్వర్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ రాముడును కోరారు. బుధవారం ఆయన గ్రామంలోని ఇంటి యజమానుల తరపున వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. సంవత్సరాలు గడుస్తున్న వార్డులోని కొంతమంది గృహ యజమానులకు వారి పేరుతో పన్నులు కానీ డోర్ నెంబర్లు కానీ లేవని వీటిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

8 నుంచి శ్రీరంగనాథుని నూలు పూజ ఉత్సవాలు

పులివెందుల టౌన్ : స్థానికంగా వెలసిన శ్రీరంగనాథస్వామి నూలు పూజ ఉత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యవర్గం ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 14వ తేదీన శ్రీరంగనాథస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అన్నదాన ప్రసాద నిర్వహణ ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని చల్లా వంశీయులు నిర్వహించనున్నారు.

జూదరుల అరెస్టు

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని రామనపల్లి దళితవాడ సమీపంలోని కంపచెట్లల్లో (మంగతాయి) జూదం ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.3500 నగదును స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు సీఐ పురుషోత్తంరాజు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



సుధాకర్‌రెడ్డి (ఫైల్)

పెద్దముడియం : నెమళ్లదిన్నె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, గ్రామ సర్పంచ్ ఓ.సుధాకర్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం రోజు తన పొలంలో కూలీల చేత వరినాట్లు వేయిస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే అక్కడ ఉన్న వారు జమ్మలమడుగు హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడు. పది సంవత్సరాల క్రితం అతని భార్య కూడా గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో దివిజ సంపతి

వేంపల్లె: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని వేంపల్లె మండల అభివృద్ధి అధికారిణి దివిజ సంపతి అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో టెన్నికాయిట్ జిల్లా స్థాయి పోటీలు బుధవారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం క్రీడలతోనే సాధ్యమన్నారు. టెన్నికాయిట్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఎంపికైన వారంతా ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ స్టాలిన్ ఐజాక్, హెచ్‌ఎం శివమునెమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్, ఫ్రాన్సిస్ రవికుమార్, జయప్రద, పిఈటీలు విజయభారతి, ప్రభావతి, స్కూల్ కమిటీ చైర్మన్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వరి సాగు పరిశీలన

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇప్పపెంట గ్రామంలో బుధవారం కడప జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు సాగుచేసిన వరి పంటలను పరిశీలించి మాట్లాడారు. రైతులు జీవామృతం తయారీ విధానం వాటి ఉపయోగాల గురించి ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల ద్వారా అధికారుల ద్వారా తెలుసుకోవాలన్నారు. ప్రతి రైతు ప్రతి పంటని తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని అలాగే ఇ-కేవైసీ కూడా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈశ్వర్‌రెడ్డి, రైతు సేవ కేంద్రం ఇన్‌చార్జి రేఖ, ఏపీ సీఎంఎఫ్ వన్ కేడర్ సిబ్బంది, ఐసీఆర్‌పీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడితే భవిష్యత్తు నాశనం



డ్రగ్స్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వేంపల్లె : డ్రగ్స్ వాడితే భవిష్యత్తు నాశనం కాక తప్పదని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం-9 అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ట్రిపుల్‌ఐటీ ప్రాంగణంలో డ్రగ్స్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం ద్వారా సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయన్నారు. భవిష్యత్తును కుంగదీసే డ్రగ్స్‌ను పకడ్బందీగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువత వాటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలనాధికారి డాక్టర్ రవికుమార్, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ మధుసూదనరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరైతు ఇ-కెవైసీ చేయించుకోవాలి

వేముల : ఖరీఫ్‌లో సాగుచేసిన అన్ని పంటలకు ఇ-పంట నమోదు చేసుకున్న ప్రతీ రైతు ఇ-కెవైసీ చేయించుకోవాలని ఏఓ చెన్నారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని మీదిపెంట్ల రైతు సేవాకేంద్రంలో జరుగుతున్న ఇ-కెవైసీని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 13,374 ఎకరాలలో ఇ-పంట నమోదు చేశామన్నారు. పంట నమోదు చేసుకున్న ప్రతీరైతు సంబంధిత సేవా కేంద్రంలో ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు తీసుకెళ్లి ఇ-కెవైసీ చేయించుకోవాలన్నారు. ఇప్పటివరకు 4,536 మంది రైతులకు గానూ 581 మంది రైతులు ఇ-కెవైసీ చేయించుకున్నారన్నారు. ఇ-కెవైసీని బయోమెట్రిక్, ఓటీపీ ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు.

ఘనంగా నబీషా వలి గంధోత్సవం

జమ్మలమడుగు : పట్టణంలోని పెన్నానదిలో వెలసిన సయ్యద్‌షా నబీషాఖాద్రీ గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆస్థానయే కమాలియా పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్ పాషాఖాద్రీ, సయ్యద్‌షా నూరుల్లా పాషా ఖాద్రీ, సయ్యద్‌షా అహమ్మద్ పాషాఖాద్రీల ఆధ్వర్యంలో గంధోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గురువులు జుబేర్‌పాషాఖాద్రీ, మోసిన్ పాషాఖాద్రీ, అసిఫ్ పాషా ఖాద్రీ, జుహిద్, అతిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి

ఎర్రగుంట్ల : రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్ తదితర పోస్టులను అర్హులైన వీఆర్ఏలతో భర్తీ చేయాలని ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ ఆండర్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వరయ్య తెలిపారు. బుధవారం ఎర్రగుంట్లలోని మార్క్స్ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలలో పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెంటనే రెవెన్యూ సహాయకులతో భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

అనుమతులు తీసుకోవాలి

వీరపునాయునిపల్లె : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వినాయకుని విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ మంజునాథ్ తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటు అనుమతుల కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సమాజసేవే మానవతా ధ్యేయం

వల్లూరు (చెన్నూరు) : సమాజసేవ ధ్యేయంగా మానవతా సేవా సంస్థ పనిచేస్తుందని ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు బసిరెడ్డి, మాజీ అధ్యక్షుడు జీఎస్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. సమాజ సేవలో భాగంగా స్థానిక హిందూ స్మశాన వాటిక వద్ద కమిటీ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు.

శ్మాశాన వాటికలోని ఇసుకను తరలించవద్దు

కొండాపురం : మండలంలోని ఏటూరులో ఇసుక రీచ్ ఏర్పాటు చేసిన రోజే శ్మాశాన వాటికలో ఇసుకను తరలించవద్దని గ్రామప్రజలు అభ్యంతరం తెలిపారు. అయితే బుధవారం శ్మాశాన వాటికలో ఇసుక తోలుతుండగా గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో కొద్దిసేపు వారిమధ్య వాగ్వాదం జరిగింది. శ్మాశాన వాటిక సమీపంలోనే పొలాల్లో రైతులు వేసుకున్న పైపులైన్లు బయటపడుతుండటంతో ఇసుకను తోలకుండా నిలిపివేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



బుక్కే వెంకటేశు నాయక్ (ఫైల్)

ఎర్రగుంట్ల : మండలంలోని సున్నపురాళ్లపల్లి గ్రామానికి చెందిన బుక్కే వెంకటేశనాయక్ (31) కనిపించకపోవడంతో తల్లి బుక్కే రతిదేవి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కలమల్ల ఎస్ఐ తిమోతి తెలిపారు. బుక్కే వెంకటేశునాయక్ ఆర్టీపీపీలోని కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు సంతానం ఉన్నారు. గత నెల 31వ తేదీన ఇంటి వద్దనుంచి వెళ్లి తిరిగి రాలేన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు